సీఎం చొరవ.. మిర్చి ధరల్లో కదలిక

- క్వింటాకు రూ. 1000కి పైగా పెరిగిన వైనం
- ఈ సీజన్‌లో తొలిసారిగా రూ. 14500 పలికిన 341 వెరైటీ
- తేజ రకం కూడా రూ. 14,200కు చేరిక
- భవిష్యత్తులో మరింత పెరిగే సూచనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

8

గులియన్ గుబులు


వినుకొండ : కొత్తపేట బలరాం హాస్పటల్ సమీపంలో మురుగు కాలవలో మంచినీటి పైపులు

- కలుషిత నీరు, ఆహారంతోనే జీబీఎస్ వ్యాప్తి
- పట్టణాల్లో ప్రమాద ఘంటికలు
- పట్టించుకోకుంటే పరిస్థితి విషమం


గుంటూరు సంగడిగుంటలో ఇలా..

బాపట్ల : జీబీసీరోడ్డులో ఎస్‌ఎన్‌పీ అగ్రహారం దగ్గర డ్రైనేజీలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్

8

ఉసురు తీసిన వరల బావి


మృతులు మహంకాళి (29), రాజేష్(20), కాళీ బాబు(52), బాలయ్య(45)

6

బతుకుదెరువు కోసం నంబూరు కాళీ బాబా ఆశ్రమ సమీపంలోని గోశాలలో కూలి పనులకు చేరారు. వరల బావిని శుభ్రం చేసేందుకు సోమవారం అందులోకి ఇనుపనిచ్చిన వేసుకుని దిగారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా జరిగి తొలుత గండాల మహంకాళి (29), అనంతరం యాకుల రాజేష్(20), వేటగిరి బాలయ్య(45), మండాది కాళిబాబు (52) విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. ఒకరిని కాపాడే యత్నంలో మరొకరు, ఇలా వరుసగా నలుగురు మృత్యువాత పడ్డారు. సంఘటనపై మంత్రి గొట్టిపాటి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- విద్యుదాఘాతంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- గోశాలలో బావిని శుభ్రం చేస్తుండగా ప్రమాదం


ప్రమాదానికి కారణమైన వరల బావి


సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిఘా నీడలో.. ఇంటర్ పరీక్షలు

- ప్రతి గదిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ
- ప్రతి ప్రశ్నా పత్రానికి క్యూఆర్‌కోడ్
- సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నాపత్రాలు సీల్ తీయాలి
- జవాబు పత్రాల బండిల్స్ ప్యాకింగ్ కెమెరాల నిఘాలోనే..
- వాట్సప్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడుకు ఆస్కారం

ఒక్కో పరీక్షా కేంద్రంలో గేటు బయట.. ప్రతి గదిలో సగటు రెండుకు పైగా సీసీ కెమెరాలు. వాటి ద్వారా అనుక్షణం జిల్లా కేంద్రంలో, రాష్ట్ర కార్యాలయంలో పర్యవేక్షణ చేసే యంత్రాంగం. ప్రతి ప్రశ్నా పత్రానికి బార్ కోడింగ్.. క్యూఆర్ కోడ్ స్కానర్.. పొరపాటున ప్రశ్నా పత్రం బయటకు వెళితే ఏ జిల్లాలో.. ఏ ఊరిలో.. ఏ కేంద్రంలో ప్రశ్నా పత్రం బయటకు వచ్చిందని తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం.. పటిష్టమైన కస్టోడియన్ కేంద్రాలు.. అక్కడ నుంచి ప్రశ్నా పత్రాలు తరలించేందుకు ప్రత్యేక రూట్ మ్యాప్‌లు... నిత్యం పరీక్షల్ని పర్యవేక్షించేందుకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్. ఇలా కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది నిర్వహించనున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా అనేక నూతన సంస్కరణలు ఇంటర్ పరీక్షల కోసం ప్రవేశపెట్టారు.

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షల్ని ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టు మైన భద్రత నడుమ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్‌వీ సుబ్బారావు, పరీక్షల ప్రత్యేక అధికారిగా డీవీఈవో పద్మను ప్రభుత్వం నియమించి పరీక్ష నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణలో కీలక భూమిక పోషించే చీఫ్ సూపరింటెండెంట్స్(సీఎస్‌లు), డిపార్టుమెంట్ ఆఫీసర్ల(డీవో)లతో సమీక్ష నిర్వహించిపరీక్ష కోసం విస్తృత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యా ర్థిని విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నట్లు తెలిపారు. మొత్తం 81 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. గేటు బయట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా విద్యార్థులు, ఇతర పర్యవేక్షణ సిబ్బంది రాకపోకల్ని గమనిస్తారు. గదుల్లో ఏర్పాటు చేసిన కెమెరాల కిందనే ప్రశ్నా పత్రాల సీల్ తీయడం, జవాబు (మిగతా 8వ పేజీలో)

నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్


గుంటూరు నుంచి బంగ్లాదేశ్‌కు లారీలో జూట్ విత్తనాలు

- లైసెన్స్ లేకున్నా ప్రాసెసింగ్ ప్రక్రియ
- జూట్ విత్తనాలు బంగ్లాదేశ్ కు తరలింపు
- నకిలీ పత్తి, మిరప విత్తనాలకు ఇక్కడ హంగులు
- బీజీ-2 మాదిరిగానే బీజీ-3 అమ్మకం
- కళ్లు తెరవకుంటే ఖరీఫ్ గుల్లే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ నకిలీ విత్తనాల హబ్‌గా మారింది. ఇక్కడ కొన్ని కంపెనీలు లైసెన్సుతో విత్తనాల ప్రాసెసింగ్ చేస్తున్నాయి. సందట్లో సడేమియా అన్నట్లుగా మరికొన్ని కంపెనీలు అసలు అనుమతి లేకుండానే భారీ విత్తన వ్యాపారం గుట్టుగా సాగిస్తున్నాయి. ఎక్కడో ఫెయిల్ అయిన విత్తనాలు ఇక్కడకు తీసుకువచ్చి ప్రాసెసింగ్ పేరుతో వినియోగంలోకి తెచ్చే ప్రక్రియ గత కొన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇక్కడ ప్రాసెసింగ్ చేసిన జూట్ విత్తనాలను బంగ్లాదేశ్, నేపాల్ తదితర ప్రాంతాలకు ఎక్కువ మొత్తంలో పంపటం అనేది చాలా గోప్యంగా జరుగుతుంది. వస్తున్నాయో.. పోతున్నాయో.. తెలియదు కానీ గుంటూరులోని పార్శిల్ కార్యాలయాలు మాత్రం వ్యవసాయ సంబంధిత బస్తాలు, అట్ట పెట్టలతో కిక్కిరిసి పోతుంటాయి.

మొదలైన ఖరీఫ్ హడావుడి..

రబీ సాగు చివరకు వచ్చింది. ఒక్క పంటకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే రైతులు ఖరీఫ్ కోసం ఎదురు చూస్తుంటారు. అందుకు సంబంధించిన విత్తనాల హడావుడి మాత్రం ఫిబ్రవరి నుంచి ఆరంభం అవుతుంది. కంపెనీలు కూడా ఈ మార్చికి నిల్వలను అన్ని ప్రాంతాలకు చేరవేస్తాయి. అందులో భాగంగా విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు తీరిక లేకుండా పనిచేస్తున్నాయి. గుంటూరు ఆటోనగర్‌లో కొన్ని లైసెన్సు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నాయి. లైసెన్సు ఉన్న వారి వద్ద చిన్నా, చితక వ్యాపారులు కూడా కొన్ని రకాల విత్తనాలను ప్రాసెసింగ్ చేయిస్తున్నారు. వాటిని రైతులకు విక్రయించేందుకు సిద్ధ పరుస్తున్నారు.

అనుమతి కొందరికే...

ప్రస్తుతం జూట్ ఎగుమతి జోరుగా సాగుతోంది. ఇక్కడ వాస్తవానికి అనుమతి పొందిన వ్యాపారులు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. కానీ సుమారు 100 మంది జూట్‌ను ఇతర దేశాలు, రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. లైసెన్సు లేకుండా ప్రాసెసింగ్ చేయించి బంగ్లాదేశ్, నేపాల్, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గుంటూరు నుంచి ఆయా ప్రాంతాలకు లెక్కకు మించిన సంఖ్యలో జూట్ ఎగుమతి చేస్తున్నారు. ఎర్రజూట్,నల్ల జూట్ విత్తనాలును వేర్వేగా పంపటం జరుగుతుంది. రైతు వద్ద నుంచి అతితక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ పేరుతో అతి ఎక్కువకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆటోనగర్ నుంచి రోజుకు 10 లారీలకు తగ్గకుండా జూట్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడే మినుముల (మిగతా 8వ పేజీలో)

పీడీఎఫ్ హ్యాట్రిక్ కొట్టేనా..?

- 2013, 2019లో వరుసగా గెలుపు
- పట్టు కోసం కూటమి వ్యూహాలు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి 18 ఏళ్ల అయింది. శాసనమండలి పునరుద్ధరణ తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ ఆ తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. దీంతో గత రెండు పర్యాయాల నుంచి ఈ నియోజకవర్గంలో గెలుపు టీడీపీకి నిరాశనే మిగిల్చింది. దీంతో ఈ దఫా ఎలాగైనా గెలుపొందాలన్న పట్టుదలని ఆ పార్టీ నాయకత్వం, క్యాడర్, బీజేపీ, జనసేనలు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు పీడీఎఫ్ గ్రౌండ్‌వర్క్ చేసుకుంటున్నది. శాసనమండలి పునరుద్ధరణ జరిగిన తర్వాత తొలిసారిగా 2007లో ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన చిగురుపాటి వరప్రసాద్ విజయం (మిగతా 8వ పేజీలో)


మెట్ల పూజ చేస్తున్న యువతులు

- స్వామిని దర్శించుకొనేందుకు క్యూలైన్‌లో భక్తులు

కోటప్పకొండలో... భక్తుల సందడి

- ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు
- త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు
- కొండకు తరలి వచ్చిన ప్రభలు

8

అమరేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్, ఎస్పీ



అమరేశ్వరుని దర్శించుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అధికారులకు ఈవో పి.సునీల్‌కుమార్ స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లారు. కలెక్టర్, ఎస్పీ పేరు మీద ఆలయ అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధికారుల వెంట ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎస్పీ ఎం.హనుమంతరావు, సీఐ అచ్చయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆగిన రైలు.. ఆగ్రహించిన ప్రయాణికులు

- గంటా 22 నిమిషాలు నిలిపివేత
- కారణం చెప్పాలని స్టేషన్ మాస్టర్‌ను నిలదీత



స్టేషన్ మాస్టర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు

వేమూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రేపల్లె నుంచి గుంటూరుకు వెళ్లే ప్యాసింజర్ రైలును వేమూరు స్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫాంలో 1 గంట 22 నిమిషాల పాటు ఆపివేశారు. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రైలు డ్రైవర్‌ను ప్రయాణికులు ప్రశ్నించగా సిగ్నల్ ఇవ్వని కారణంగా స్టేషన్‌లో నిలిపి వేశానని చెప్పారు. స్టేషన్ మాస్టర్‌ను కారణం చెప్పమని వారు అడుగగా ఫోన్‌లో మాట్లాడుతూ, సెల్ ద్వారా ప్రయాణికులను వీడియోలు తీస్తుండటంతో వారు ఆగ్రహించారు. సమాధానం చెప్పకుండా మమ్మల్ని వీడియో తీస్తారా అంటూ నిలదీశారు. సమీపంలో ఉన్న రైల్వే ఏఎస్ఐ ప్రయాణికులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. రేపల్లె నుంచి 9 గంటల 59 నిమిషాలకు వేమూరుకు రావాల్సిన రైలు 11 గంటల 11 నిమిషాలకు చేరుకుంది. అప్పటి నుంచి 12.33 వరకు ప్లాట్‌ఫారంపైన నిలిపి వేశారు. తీరా రైలును ఎందుకు నిలిపివేశారు అన్న దానిపై ఆరా తీయగా, తెనాలి, సంగంజాగర్లమూడి స్టేషన్‌లో ట్రాక్ మరమ్మతులు చేపట్టడం వలన నిలిపి వేసినట్లు తెలిసింది. ఈ విషయం ప్రయాణికులకు తెలియడంతో అలాంటప్పుడు ట్రైన్‌ను రేపల్లెలోనే ఆపి వేసి ట్రిప్ క్యాన్సిల్ చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ఇందుకు రైల్వే సిబ్బంది ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారు. ప్రయాణికులు చివరకు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పరిస్థితిని స్టేషన్ మాస్టర్ ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో గుంటూరు నుంచి రేపల్లెకు వెళ్లే ప్యాసింజర్ రైలు తెనాలి స్టేషన్ నుంచి వదిలారు. వేమూరు స్టేషన్‌లోని 1వ నంబరు ప్లాట్‌ఫారంకు రైలు 28 నిమిషాలు ఆలస్యంగా 12.30 నిమిషాలకు చేరుకుంది. నిలిచిపోయిన గుంటూరు వెళ్లాల్సిన రైలును 12.33 నిమిషాలకు వదిలారు. రైల్వే శాఖ అధికారుల తీరుపై ప్రయాణికులు అనేక విమర్శలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉసురు తీసిన వరలబావి

- విద్యుదాఘాతంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- గోశాలలో బావిని శుభ్రం చేస్తుండగా ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగానీ.. డొక్కాడని బడుగు జీవులు ఆ కూలీలు. బతకడం కోసం ఉన్న ఊరిని వదులుకొని వచ్చారు. ఏడాదిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పెదకాకాని సమీపంలోని నంబూరు కాశీ బాబా ఆశ్రమ సమీపంలో గోశాలలో ఈ సంఘటన జరిగింది. తెనాలి సమీపంలోని చినరావూరుకు చెందిన గండాల మహంకాళి(29), వేటగిరి బాలయ్య(45), దుగ్గిరాల మండలం పెనుముడి గ్రామానికి చెందిన యాకుల రాజేష్ (20) అనే ముగ్గురు ఏడాదిగా గోశాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. గోశాలలో సేవ చేసేందుకు సత్తెనపల్లి సమీపంలోని కట్టమూరు గ్రామానికి చెందిన మండాది కాళిబాబు(52) గోశాల వద్దకు వచ్చాడు. వరలబావిలోకి దిగి శుభ్రం చేసే క్రమంలో లోపల ఉన్న వేస్ట్ వాటర్ బయటికి పంపేందుకు విద్యుత్ కంప్రెషర్‌తో ప్రయత్నించారు. కంప్రెషర్‌కు ఉన్న వైర్లు తెగి విద్యుత్ సరఫరా అయింది. బావిలోకి ఇనుపనిచ్చిన వేసుకొని దిగడంతో తొలుత గండాల మహంకాళి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. గమనించిన యాకుల రాజేష్ అతన్ని కాపాడేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. వీరిని కాపాడే యత్నంలో వేటగిరి బాలయ్య, మండాది కాళిబాబు విద్యుదాఘాతానికి గురై నిమిషాల్లోనే దుర్మరణం చెందారు. మండాది కాళిబాబు(52) గోవులకు సేవ చేసేందుకు వచ్చి మృత్యువాత పడ్డాడు. ఆవులకు సేవ చేస్తే పుణ్యం దక్కుతుందని వచ్చి మృతి చెందాడు.

విషాదఛాయలు...

నలుగురు మృతి చెందటంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ తెలిపారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

విద్యుదాఘాతం ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన నలుగురు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనపై స్థానిక శాసన సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రతోపాటు స్థానిక అధికారులతో కూడా మంత్రి మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ సన్నద్ధం

- కోటప్పకొండకు 550 బస్సులు సిద్ధం
- గుంటూరు నుంచి శైవక్షేత్రాలకు 200 సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు ఆర్టీసీ సమాయత్తమైంది. రాష్ట్రంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలలో ఒకటైన కోటప్పకొండ తిరునాళ్లకు ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఒక్క కోటప్పకొండ తిరునాళ్లకు 550 బస్సులను సిద్ధం చేశారు. ఇప్పటికే జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు కోటప్పకొండ వద్ద పర్యటించి ఆర్టీసీ ఏర్పాట్లుపై ప్రత్యేకంగా పరిశీలించారు. గుంటూరు నుంచి నరసరావుపేటకు చేరుకునేందుకు గుంటూరు-1 డిపో నుంచి 20 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండ బస్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయని గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్ తెలిపారు. ఇతర శైవక్షేత్రాలైన అమరావతి, గోవాడ, క్వారీ వంటి క్షేత్రాలకు మరో 180 బస్సులను సిద్ధం చేశారు. 25వ తేదీ సాయంత్రం నుంచే ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కోటప్పకొండ జాతర కోసం కొండ పైకి...కిందికి రాకపోకలు సాగించేందుకు తిరుపతి నుంచి మినీ బస్సులను అందుబాటులోకి తెస్తున్నారు. భక్తుల రద్దీని అనుసరించి ముందుగా 60 బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కోటప్పకొండ తిరునాళ్లకు 105 ప్రత్యేక బస్సులు



రాంబాబు, చిలకలూరిపేట డిపో మేనేజర్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో నుంచి 105 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు సోమవారం తెలిపారు. చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు రూ.30 చార్జిగా నిర్ణయించినట్టు చెప్పారు. బస్సులు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు వేర్వేరు మార్గాలలో నడుస్తాయని ఆయన వివరించారు. కోటప్పకొండకు వెళ్లేందుకు పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు దిగువన ఉన్న ప్రాంతం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. తిరునాళ్ల ప్రత్యేక బస్సులు ఈనెల 26వ తేదీ తెల్లవారుజాము నుంచి 24 గంటల పాటు నడుస్తాయని వివరించారు.

నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్

(5వ పేజీ తరువాయి)

విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎక్కడెక్కడో కొనుగోలు చేసి తీసుకువచ్చిన విత్తనాలను అందమైన ప్యాక్ లలో నింపుతున్నారు.

బీజీ-2 కాదు..బీజీ-3

ఆటోనగర్ వేదికగా బయటకు వస్తున్న పత్తి విత్తనాలపై పలు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి బీజీ-2 పత్తి విత్తనాలను మాత్రమే సాగు చేయాలి. అయితే ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 విత్తనాలను ఇక్కడ నుంచి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బీజీ-2 విత్తనాల ప్యాకెట్లలోనే వాటిని నింపి అమ్మకాలు జరుపుతున్నారన్న వాదన ఉంది. మిరప విత్తనాలు కూడా బెంగుళూరు ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడి గోడౌన్లలోనే ఉంచుతున్నారు. అక్కడ ప్రముఖ కంపెనీల లో ఫెయిల్ అయిన లాట్స్ ను ఇక్కడ కు తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు.

47 పార్శిల్స్...

గుంటూరు లో 47 పార్శిల్స్ కార్యాలయాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఎక్కడ నుంచి ఎక్కడకు సరుకు వెళ్లాలన్నా ఇక్కడ కు రావాల్సిందే.నకిలీ విత్తనాలు కూడా ఆయా పార్శిల్స్ ద్వారానే అటు ఇటు సరఫరా అవుతున్నాయి. గతంలో అధికారులు ఆయా పార్శిల్స్ లో తనిఖీ లు నిర్వహించి కేసులు నమోదు చేశారు. తనిఖీ లకు వెళ్లిన ప్రతి సారి ఏదో ఒక కేసు నమోదు అయ్యింది. ఈ మధ్య కాలంలో తనిఖీ లు బొత్తిగా లేవన్న వాదన వినిపిస్తోంది. ఖరీఫ్ లో రైతులు నకిలీ విత్తనాల బారీన పడకుండా ఉండాలంటే ఆటోనగర్ తో పాటు,పార్శిల్స్ కార్యాలయాలపై దృష్టి కేంద్రీకరించాలని పలువురు సూచిస్తున్నారు.

పీడీఎఫ్.. హ్యాట్రిక్ కొట్టేనా..?

(5వ పేజీ తరువాయి)

సాధించారు. అయితే ఆయన ఎమ్మెల్సీగా విజయవాడకే ఎక్కువగా పరిమితమయ్యారు. దాంతో గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ నేతలు 2013లో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. సీఎం చంద్రబాబు అప్పటి నేతలను పిలిపించుకుని మాట్లాడి తిరిగి వరప్రసాద్‌కే మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి బొడ్డు నాగేశ్వరరావు రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో గెలుపొందారు. 2019లో సాధారణ ఎన్నికలకు నెల ముందు పట్టభద్రుల ఎన్నికలు వచ్చాయి. దాంతో టీడీపీ ప్రత్యక్షంగా ఫలాన అభ్యర్థికి తాము మద్దతిస్తున్నామని ప్రకటించలేదు. అయితే శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం నూతలపాటి అంజయ్య పోటీ చేసి టీడీపీ మద్దతు తనకే ఉందని ప్రకటించుకున్నారు. ఆ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పోటీ చేసి రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం సాధించారు.

ఆలపాటి, లక్ష్మణరావు మధ్య హోరాహోరీ

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి నాల్గో దఫా ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో ఎలాగైనా విజయం సాధించి పూర్వవైభవం సంతరించుకోవాలని టీడీపీ కూటమి విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా జనసేన, బీజేపీ నాయకులు ప్రచారంలోకి దిగారు. కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మద్దతు కూడా టీడీపీ కూడగట్టుకున్నది. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు కోసం ఉపాధ్యాయ సంఘాలు గత కొన్ని రోజుల నుంచి గ్రౌండ్‌వర్కు చేస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులను కలుసుకుని లక్ష్మణరావుకు మద్దతుని కూడగడుతున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ హోరాహోరీగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో విజయం తేలకపోవచ్చని, రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతోనే ఫలితం వస్తుందని అంచనా వేస్తున్నారు. సాధారణ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు భిన్నం కావడంతో తొలి ప్రాధాన్య ఓటు కోసమే అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ప్రచార, ఆత్మీయ సమావేశాలను ముమ్మరం చేశాయి.

దర్శనానికి 10 వేలకు పైగా వీఐపీ పాసులు

నరసరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు భారీగానే గతేడాది తరహాలోనే వీఐపీ పాసులు జారీ చేసేందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది. త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వీఐపీల కోసం 10 వేలకు పైగా పాసులు జారీ చేయనున్నారు. నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో వీఐపీ దర్శనం పాసులు జారీ చేయనున్నట్లు సమాచారం. గతేడాది వైసీపీ నేతలు వేల సంఖ్యలో వీఐపీ దర్శనం పాసులు జారీ చేశారు. వైసీపీ హయాం నుంచే వేల సంఖ్యలో వీఐపీ పాసులు జారీ ప్రారంభమైంది. దీనిని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. పార్టీ నేతలు, కార్యకర్తలకే అధిక సంఖ్యలో వీఐపీ పాసులు జారీ చేయనున్నారు. వీఐపీ పాసులు జారీ చేసే అధికారం దేవస్థానంకే ఉంది. అయితే దేవస్థానం నుంచి పాసులు జారీని పోలీసు శాఖ తీసుకోవడం గమనార్హం. దేవస్థానం ఈవో సంతకంతో ఉన్న స్టాంపును కూడా పోలీసు అధికారులు తీసుకున్నట్టు తెలిసింది. ఈవో పేరుతోనే ఆయన సంతకం ఉన్న స్టాంపును ముద్రించి పాసులు పోలీసు శాఖ జారీ చేస్తుండటం గమనార్హం. వీఐపీ పాసుల జారీ అంశంపై ఈవో చంద్రశేఖరరావును వివరణ కోరగా దేవస్థానం కార్యాలయం నుంచి పాసులు జారీ చేయడంలేదనీ, పోలీసు శాఖ పాసులు జారీ చేస్తుందని తెలిపారు. వీఐపీ వాహన పాసులను కూడా పోలీసు శాఖ జారీ చేస్తుంది. వీఐపీల కోసం దాదాపు 20 ఆర్టీసీ సర్వీసులను కొండ కింద నుంచి కొండపైకి నిర్వహించనున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు గత ఐదేళ్లుగా నమ్మించి మోసంచేసి, గుట్టుచప్పుడు కాకుండా మరో యువతితో వివాహం చేసుకోవడంతో, కలత చెందిన ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హనుమాన్‌నగర్‌కు చెందిన అత్తర్ నాగూర్ పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని నమ్మించి మోసగించాడు. ప్రశ్నించిన యువతి ఇంటిపై దాడి చేశాడు. దీంతో కలత చెందిన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. గతంలో ఆమె ఫిర్యాదు చేసిన కేసులో నాగూర్ జైలుకు కూడా వెళ్లారని పోలీసులు తెలిపారు.

ఓట్ల లెక్కింపు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి



జిల్లా పరిషత్తులో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్‌వో

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్లు ఏకాగ్రతతో, సమర్థవంతంగా, కచ్చితంగా, సత్వరమే లెక్కింపు చేయాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజులతో కలిసి శాసనమండలి ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్లు లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్‌వైజర్లు, రో ఇన్‌చార్జిలు పర్యవేక్షణ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈఆర్‌వో నాగలక్ష్మి మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపథ్యంలో ఓట్లు లెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా రావాల్సి ఉందన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకు బ్యాలెట్ బాక్స్‌లు తీసుకువచ్చినప్పుడు పోలింగ్ కేంద్రం, పోలైన ఓట్లు, తదితర వివరాలు పూర్తిగా సరిచూసుకోవాలన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల డీఆర్‌వోలు ఎన్ఎస్ కే ఖాజావలి, మురళి, గంగాధర గౌడ్, చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సులను సక్రమంగా అందజేయాలి

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన బ్యాలెట్ బాక్సులు, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ ఫారాలతో కూడిన కిట్లను రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి పరిశీలించారు. సోమవారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలసి వాటిని పరిశీలించారు. మెటీరియల్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల నోడల్ అధికారి అయిన జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసును బ్యాలెట్ బాక్సులకు సీరియల్ నంబర్లు వేసి వాటిని పోలింగ్‌స్టేషన్ల వారీగా సిద్ధపరచాలని సూచించారు. డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

త్రికోటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం

నరసరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 26న తిరునాళ్ల వైభవంగా జరగనుంది. తిరునాళ్లకు రాష్ట్ర పండగ హోదా ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టువస్త్రాలతోపాటు వెండి ప్రభ కూడా సమర్పిస్తారు. ఇందుకు ప్రభుత్వం రూ.20 వేలు దేవస్థానానికి విడుదల చేసింది.

ధ్యానబుద్ధను సందర్శించిన శ్రీలంక బౌద్ధులు



చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తున్న బౌద్ధగురువు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) ఇండియన్ మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో శ్రీలంక దేశానికి చెందిన 77 మంది బౌద్ధ భిక్షువులు, మతస్తులు సోమవారం ధ్యానబుద్ధ ప్రాజెక్టును సందర్శించారు. వీరు గత 25 రోజులుగా దేశంలోని ఐదు రాష్ట్రాలలో ఉన్న బౌద్ధ క్షేత్రాలను సందర్శించి చివరిగా అమరావతి చేరుకున్నారు. అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టుతోపాటు మహాచైత్యం, అమరేశ్వరాలయం సందర్శించారు. వీరి వెంట ఉన్న బౌద్ధ గురువు అమరావతిలో బౌద్ధ చారిత్రక ప్రాధాన్యతను వారికి వివరించారు.

కృష్ణానదిలో మత్స్యకారులపై దాడి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డిపురం తండా వద్ద కృష్ణా జలాశయంలో ఆంధ్ర ప్రాంత మత్స్యకారులపై తెలంగాణకు చెందిన వ్యక్తులు దాడి చేసి చేపల వలలు అపహరించిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని విజయపురిసౌత్‌కు చెందిన మత్స్యకారులు సుమారు 50 ఏళ్లుగా నారాయణరెడ్డిపురం తండా వద్ద కృష్ణా జలాశయంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి విజయపురిసౌత్‌కు చెందిన ఎరిపల్లి చిట్టిబాబు, బొడ్డు సత్యారావులు కృష్ణానదిలో వలలు వేసి చేపల వేట చేస్తుండగా తెలంగాణ ప్రాంతంలోని నాయకులతండాకు చెందిన నల్లబాలు, నత్తి రాము, మునితోపాటు మరో ఐదుగురు వ్యక్తులు వారిపై దాడి చేసి వలలు అపహరించుకుపోయారు. వలల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నాగార్జున సాగర్ కుడికాలువలో యువకుడు గల్లంతు

దుర్గి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా బలికేశ్వరం మండలం ముత్తేశ్వరం గ్రామానికి చెందిన గుట్టపల్లి అయ్యప్ప (28) తన స్నేహితుడు శ్రీనుతో కలిసి మండలంలోని అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనానికి వచ్చారు. ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తూ మార్గమధ్యలో కుడికాలువలో ఈతకు దిగి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.



అయ్యప్ప (ఫైల్)

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 30.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.



సత్తెనపల్లి మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనంద్ కుమార్

సత్తెనపల్లి మునిసిపల్ కమిషనర్‌గా

ఆనంద్ కుమార్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా కె.ఆనంద్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్ వైజర్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతి పై సత్తెనపల్లి పురపాలక సంఘ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు మునిసిపల్ అధికారులు,సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

మొక్కలను సంరక్షించాలి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంభంపాడులో గల బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవస్థాన కమిటి ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ శివ, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో భోజనం తనిఖీ

మాచర్లటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని అన్నక్యాంటీన్‌లో ఆహార పదార్థాలను మాచర్ల మునిసిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. పేదలకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అలాగే పట్టణంలోని 1, 2 వార్డుల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జూదరులు అరెస్టు

రెంటచింతల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశర్లపాడు గ్రామంలో జూదమాడుతున్న 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3300 స్వాధీనం చేసుకున్నామన్నారు.

లాజరయ్యకు పిన్నెల్లి నివాళి..

మాచర్లటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డుకు చెందిన లాజరయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పట్టణానికి చేరుకొని లాజరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భోజనం ప్లేట్లు అందజేత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి పల్నాటి అఖిల భారత అన్నదాన సత్రం ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలలోను ముందుకు సాగుతామని ట్రస్టు అధ్యక్షుడు కాకుమాను జగన్నాథరావు తెలిపారు. సోమవారం నెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాల, ఎస్సీ కాలనీలోని ఏబీఎం పాఠశాలలో 100 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. విద్యార్థులలో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ఆట వస్తువులను అందజేస్తామని జగన్నాథరావు తెలిపారు. కార్యక్రమంలో గంగవరపు రామలక్ష్మణరావు, గుత్తా వెంకట్రావు, ముప్పాళ్ల హనుమంతరావు, దామరచర్ల హనుమంతరావు, యనమదల సుబ్బారావు, ముప్పాళ్ల హనుమంతు, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, కంకణంపాటి బ్రహ్మానందం, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 15,52,027

దుర్గి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థాన హుండీ ఆదాయంను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సోమవారం లెక్కించారు. 45 రోజులపాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన ఆదాయం రూ. 15,52,027 తేలింది. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఏసీ పి.సైదమ్మబాయి, ఈవో సీహెచ్ శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి అందజేత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రసూల్‌పేటకు చెందిన నిరుపేద మైనారిటీ కుటుంబానికి రూ. 25 వేలు విలువ చేసే ఇంటి సామగ్రిని సోమవారం టీఎన్‌టీయూసీ సభ్యులు అందజేశారు. రసూల్‌పేటకు చెందిన సమీరాకు టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యరగాని వెంకట్,సయ్యద్ అమీర్‌అలి, సైదా, యరగాని హనుమంతరావు, సతీష్, నాగేశ్వరరావుతో పాటు మరికొందరు కలిసి డబుల్ కాట్ మంచం, బీరువా, మరికొన్ని ఇంటి సామగ్రిని అందజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గురజాలటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకం వారి వీధికి చెందిన కసిరెడ్డి మట్టారెడ్డి ఇంటిలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. స్విచ్ బోర్డు నుంచి మంటలు వచ్చి గృహంలోని ఫ్రిడ్జ్ సిలిండర్ పేలింది. దీంతో గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు రూ.8 లక్షలు ఆస్థినష్టం వాటిల్లినట్లు బాధితుడు మట్టారెడ్డి తెలిపారు.

మహాశివరాత్రి భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు
- అమరేశ్వరాలయంలో ఏర్పాట్లు పరిశీలన
- వివిధ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు



ఆలయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని శైవ క్షేత్రాల్లో భక్తులకు మెరుగైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం అమరావతిలోని అమరేశ్వరాల యంను కలెక్టర్, ఎస్పీలు సందర్శించి మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం వద్ద పారిశుధ్యం, మద్య నియంత్రణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఆలయప్రాంగణం, స్నానఘాట్‌ల వద్ద పోలీసు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమన్వయ సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది శైవక్షేత్రాలుండగా, వాటిలో కోటప్పకొండ, అమరావతి, సత్రశాల, దైదాలు ప్రధానమైనవిగా ఉన్నాయన్నారు. కోటప్పకొండలో 2000 మంది, అమరావతిలో 250 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎస్పీ ఎం.హనుమంతరావు, ఈవో సునీల్‌కుమార్, సీఐ అచ్చయ్య, ఎంపీడీవో శివపార్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజారోహణతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం



ధ్వజారోహణ చేస్తున్న వేదపండితులు, అర్చకులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో రెండోరోజు 26న ఆలయంలో జరిగే స్వామివార్ల కళ్యాణమహోత్సవానికి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ అర్చకులు, వేదపండితులు ధ్వజారోహణ పేరుతో ధ్వజస్థంబానికి ఆహ్వానపత్రిక కట్టి ఎగురవేశారు



విద్యుత్ కాంతులతో 85 తాళ్లూరులోని ఆలయం

పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు, 75 తాళ్ళూరు తదితర గ్రామాల్లో మహాశివరాత్రి మహోత్సవాల నిర్వాహణకు ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 85 తాళ్ళూరులోని కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం, అలంకారం, మహానివేదన, మహా హారతి నిర్వహిస్తామన్నారు. రాత్రి 7 గంటలకు భక్తులకు అన్నదానం, రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవ సమయం వరకు రుద్రాభిషేకాలు, అనంతరం శివ పార్వతుల శాంతి కళ్యాణం జరుగుతుందని తెలిపారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో ఒకటైన దైద అమరలింగేశ్వరుని ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. స్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తులకు సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. స్నానాల ఘాట్ వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని మోర్జంపాడు శివారు అటవీ ప్రాంతంలో ఉన్న భ్రమరాంభ సమేత బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. మాచవరం, పిడుగురాళ్ళ మండల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాల వారు అన్నదాన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ, మంచి నీటి వసతి ఏర్పాటు చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని పూజారులు తెలిపారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): 26వ తేది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగ సత్రశాల పుణ్యక్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు గురజాల డీఎస్పీ బీఎల్ఎన్ జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం వద్ద విధుల్లో సీఐతో పాటు నలుగురు ఎస్ఐలు, 84 మంది కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. ఏపీజెన్‌కో, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రెండు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతామన్నారు.

శివరాత్రి పుణ్య స్నానాలకు నీరు విడుదల

సత్రశాలలో ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా నదిలో భక్తులు పుణ్య స్నానమాచరించేందుకు వీలుగా టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. ఈవిషయమై సోమవారం ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడారు. పుష్కరఘాట్ల వద్ద తగనంత నీరు లేదని, ఉన్న నీరు బాగా లేదని వివరిస్తూ, గంటకు 120 క్యూసెక్కుల చొప్పున రెండు గంటలకు 240 క్యూసెక్కుల నీటిని బుధవారం ఉదయం నుంచి విడుదల చేయాలని కోరగా ఎస్ఈ అంగీకరించినట్లు తెలిపారు.



దైద శ్రీ అమరలింగేశ్వరస్వామి, ఉప ఆలయాలు

పంట వ్యర్థాలకు నిప్పు

- విద్యుత్ టవర్‌ను చుట్టుముట్టిన మంటలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

వెల్దుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలానికి విద్యుత్ సరఫరా అయ్యే 132 కేవీ లైన్ కింద ఓ రైతు పొలంలో ఉన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని రచ్చమలపాడు 34, 35 విద్యుత్ టవర్ల సమీపంలోని రైతు సోమవారం తనపొలంలో వ్యర్థాలకు నిప్పు పెట్టాడు. పొలం మీద ఉన్న విద్యుత్‌లైన్లు ట్రిప్ అయి మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో నరసరావుపేట డివిజన్ ఈఈ నారాయణరావు, డీఈఈ యుగంధర్, ఏఈఈ చిన నరసింహులు సంఘటనా స్థలానికి చేరుకొని, సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

రెంటచింతల పీఎస్‌కు డ్రోన్..

రెంటచింతల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాలను నియంత్రించేందుకుగాను ఎస్పీ కె.శ్రీనివాసరావు రెంటచింతల పోలీసు స్టేషన్‌కు డ్రోన్‌ను కేటాయించినట్లు ఎస్ఐ సీహెచ్.నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డ్రోన్ వినియోగం ద్వారా రద్దీ, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచి నేరాను నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా సోమవారం సత్రశాలలో మహాశివరాత్రి ఏర్పాట్లను డ్రోన్ ద్వారా చిత్రీకరించినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

మండాది బోడులో కార్చిచ్చు

వెల్దుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాది బోడు అటవీ ప్రాంతంలో మరోమారు కార్చిచ్చు చెలరేగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అడవిలో మంటలు వ్యాపించాయి. వేసవి కావడంతో అడవిలో ఉన్న గడ్డి ఎండిపోయింది. దీంతో ఎక్కడో ఒక చోట చెలరేగిన మంటలు కిలోమీటర్ల మేర దావానంలా వ్యాపిస్తున్నాయి. ఎవరైనా ఆకతాయి నిప్పంటించి ఉండవచ్చని పలువురు బావిస్తున్నారు. ఇటీవల తరచూ ఈ అటవీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మొదట్లో స్పందించిన అగ్నిమాపకసిబ్బంది, ఆతర్వాత మంటలు వ్యాపించిన సందర్భాలలో అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖాధికారులు నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నక్యాంటీన్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు

అన్నక్యాంటీన్‌లో కలెక్టర్ తనిఖీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఉన్న అన్నక్యాంటీన్‌ను సోమవారం రాత్రి కలెక్టర్ అరుణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యత గురించి ఆరా తీశారు. రోజుకు ఎంత మందికి భోజనం తెప్పిస్తున్నారు, ఎంత మంది భోజనం చేస్తున్నారు.. అనే వివరాలను కలెక్టర్ క్యాంటీన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని సిగరెట్లు స్వాధీనం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో అనుమతిలేని సిగరెట్లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్ కుమార్ ఆదేశాలతో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ పి.శివాజీ తెలిపారు. ఈ తనిఖీలలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.1.50 లక్షల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏవో ఆదినారాయణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

గురజాలటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఏవో సంధ్యారాణి సూచించారు. సోమవారం గురజాల పట్టణంతోపాటు మండలంలోని పులిపాడు, గంగవరం గ్రామాల్లో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం కందులను పరిశీలించారు. కంది పంట క్వింటాకి రూ.7550 ప్రభుత్వం మద్దతు ధరగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు

- పట్టభద్రుల ఓటర్లు 9,698 మంది

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరుజిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సత్తెనపల్లి నియోజక వర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గ పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా పోలింగ్‌కేంద్రాల్లో 9,698 తమ ఓటు వినియోగించు కోనున్నారు. సత్తెనపల్లి పట్టణ పరిధిలోని 342వ పోలింగ్ కేంద్రంలో 979 మంది, 343 పోలింగ్ కేంద్రంలో 752, 344 పోలింగ్ కేంద్రంలో 1085, 345 కేంద్రంలో 1266, 346 కేంద్రంలో 619, 347 కేంద్రంలో 618, ముప్పాళ్ళ మండల పరిధిలోని 348 కేంద్రంలో 749, 349 కేంద్రంలో 719, రాజుపాలెం మండల పరిధిలోని 350 కేంద్రంలో 594, 351 పోలింగ్ కేంద్రంలో 675, నకరికల్లు మండల పరిధిలోని 352 కేంద్రంలో 846, 353 కేంద్రంలో 796 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

స్కూల్ బస్సు ఢీకొని

రోడ్డు పని కార్మికుడు మృతి

దాచేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు పని చేస్తున్న కార్మికుడిని ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన మృతి చెందిన ఘటన సోమవారం నడికూడి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. దాచేపల్లి ఎస్ఐ పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన ఉప్పు గోపాల్ గత కొంతకాలంగా రాష్ట్ర రహదారి కార్మికుడిగా కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. సోమవారం నడికూడి రైల్వే ఓవర్ బ్రిడ్జివద్ద పనిచేస్తున్నాడు. ఆ సమయంలో ఓ ప్రైవేటు స్కూలు బస్సు వేగంగా వచ్చి గోపాల్‌కి దగ్గరగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపల్ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గోపాల్‌ను హుటాహుటీన గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం జరిగి గోపాల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకరికల్లులో అగ్నిప్రమాదం

- లక్షల్లో ఆస్థి నష్టం

నకరికల్లు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నకరికల్లులో సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు సర్వీస్ రోడ్డులోని జూలకంటి సతీష్‌కి చెందిన భవనంలో మంటలు చెలరేగాయి. దీంతో ఇరుగురు పొరుగు వారు, స్థానికులు పోలీసులు, ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అర్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా వారు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు విలువైన పత్రాలు కాలిపోయాయని, లక్షల్లో ఆస్థినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద సమయంలో సతీష్ కుమారుడు ఒక్కడే ఇంట్లో ఉన్నట్లు సమాచారం.


లూథరన్ దేవాలయం ప్రారంభం

అచ్చంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఎస్సీ కాలనీలో 13 సంవత్సరాలుగా నిర్మిస్తున్న సెయింట్ పాల్ ఏపీ పానియా శత వార్షిక లూథరన్ దేవాలయాన్ని ఏఈ ఎల్‌సీ మోడరేటర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది క్రైస్తవులు నూతన దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మధ్యమ గుంటూరు సెనెడ్ ఏఈఎల్‌సీ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జే బాబూరావు, మధ్యాహ్నం 12 గంటలకు విందు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా విధులకు హాజరు

- గుంటూరు టూ మాచర్ల డైలీ సర్వీస్
- వారంలో ఒకటి రెండు రోజులే రాక పోకలు
- హాజరు పట్టీలో అన్ని రోజులకు మస్టర్ నమోదు
- ఇదీ.. ప్రభుత్వ ఐటీఐ కళాశాల అధ్యాపకుల తీరు
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెల్లడి..

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్యాపకులు వారానికి ఒక రోజే విధులకు హాజరవుతున్నారు. కళాశాలకు అందుబాటులో ఉండి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకులు గుంటూరు నుంచి మాచర్లకు రైలులో వారంలో ఒకటి, రెండు రోజులే.. మధ్యాహ్నం 12-30 గంటలకు వచ్చి, సాయంత్రం 4 గంటలకు వెళుతూ ఉన్నారు. కళాశాలకు వచ్చిన రోజు, హాజరు పట్టీలో రాని రోజులకు వచ్చినట్లు సంతకాలు చేస్తుంటారు. ప్రిన్సిపాల్, ట్రైనింగ్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ అందరి తీరు ఇంతే.



మధ్యాహ్నం 12:30 గంటలకు కళాశాలకు వస్తున్న ప్రిన్సిపాల్



అధ్యాపకులు లేకుండా తరగతి గదిలో విద్యార్థులు

కళాశాలకు వచ్చిన ఆ రెండు రోజులు కూడా ఆఫీసులోనే నివాసముంటూ, హెచ్‌ఆర్ఏ మాత్రం యథావిధిగా డ్రా చేసుకుంటున్నారు.

హాజరు రికార్డును పరిశీలిస్తే...

కళాశాలలో సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా.. హాజరు రికార్డులో శనివారం, సోమవారం ప్రిన్సిపాల్‌తో సహా సిబ్బంది సంతకాలు లేకుండా దర్శనమిస్తున్నాయి. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. సెలవు పెట్టకుండా విధులకు హాజరుకాని వారి విచారణ కోరతానని సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లుగా ప్రిన్సిపాల్, సిబ్బంది ఈ విధంగా విధులకు డుమ్మా కొడుతూ వచ్చినరోజే ఖాళీల్లో సంతకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మాచర్ల ఐటీఐ కళాశాలపై దృష్టి సారించి పూర్తిస్థాయి విచారణ జరిపి విధులకు డుమ్మా కొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేడుకలను వైభవంగా నిర్వహిస్తాం

- సత్రశాల ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి



రెంటచింతల,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవ క్షేత్రమైన సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకను ఎంతో ప్రతి వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో గాదే రామిరెడ్డి తెలిపారు. ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లపై సోమవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఈవో రామిరెడ్డి ఫటాఫట్ ఇంటర్వ్యూ..



ప్ర: సత్రశాలలో శివరాత్రి ఉత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభమౌతాయి ?

జ: ఈనెల 25 ఉదయం నుంచి 27 సాయంత్రం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటాం..

ప్ర: శివరాత్రికి ఎంత మంది భక్తులు సత్రశాలకు రావొచ్చు ?

జ: కిందటేడాది టిక్కెట్ల ద్వారా 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సారి పెరిగే అవకాశం ఉంది. గ్రామం నుంచి ఆలయానికి వచ్చేందుకు ఇబ్బదిపడే వృద్ధులు మహిళలను తీసు కొచ్చేందుకు ప్రత్యేకంగా మూడు ఆటోలను ఏర్పాటు చేశాం.

ప్ర: శివరాత్రికి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏయే ఏర్పాట్లు చేశారు ?

జ: ఇప్పటికే రహదారికిరువైపులా గ్రావెల్ తోలి విస్తరించాం. మహిళా భక్తులకు విడిగా జల్లు స్నానం ఏర్పాటు చేశాం. ఇందుకుగానూ అవసరమైన జనరేటర్లు అందుబాటులో ఉంచాం.

ప్ర: స్వామి వారి కళ్యాణం ఏ సమయంలో జరుగుతుంది?

జ: మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తాం. అదే రోజు జాగారం చేసే భక్తుల కోసం శివతత్వం ప్రవచనాలు, భక్తి సంకీర్తనలు ఏర్పాటు చేశాం. లింగోద్భవ కాలపు పూజలను భక్తులు తిలకించేందుకు తొలిసారిగా డిజిటల్ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశాం.

ప్ర: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణ ఎలా ఉంది?

జ: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సత్రశాలలో మహా శివరాత్రి వేడులకను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్న ఆలోచనతో ఉన్నారు. ఇందుకు కోసం వివిధ శాఖల అధికారులు, ఆలయ నిర్వహకులతో ఇప్పటికే రెండు సార్లు సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఏర్పాట్లలో ఆర్థిక పరంగా ఏ ఇబ్బంది వచ్చినా తానున్నాంటూ భరోసానిచ్చారు.



పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న వెన్నా

ఆలపాటిని గెలిపించండి

- టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్నా సాంబశివారెడ్డి
- వివిధ ప్రాంతాల్లో కూటమి శ్రేణుల విస్తృత ప్రచారాలు

బెల్లంకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పట్టభద్రులను కోరారు. సోమవారం మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ జడ్పీ హైస్కూల్స్, బీసీ రెసిడెన్షియల్ స్కూలు ఉపాధ్యాయులను ఆయన కలసి ఆలపాటికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల టీడీపీ నేతలు అక్కల వెంకట రామిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, సయ్యద్ జబ్బార్, బెల్లంకొండ మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 8వ వార్డులో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆవార్డుకు చెందిన టీడీపీ నేతలు సోమవారం విస్తృతం గా ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుజ్జర్లపూడి స్టాలిని, చిలకా శ్యామ్ పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ నేతలు కోరారు. సోమవారం మండలంలోని పెదకొదమగుండ్లలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో పట్టభద్రులను కలుసుకొని మొదటి ప్రాధాన్యత ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కోదాడ ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శెట్టి హనుమంతురావు, టీడీపీ నేత కొంగర లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు లింగాల శ్రీనివాసరావు, రంగారావు, మాజీ ఎంపీపీ కె.లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి, కర్నా అమర సైదారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు తెలగనేని లక్ష్మయ్య, పెద కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్లగూడెం, చింతపల్లి, కొత్తపల్లి, తాళ్ళచెరువు తదితర గ్రామాల్లో టీడీపీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆలపాటి రాజేంద్రప్రసాదును గెలిపించాలంటూ పట్టభద్రులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, బత్తుల శ్రీనివాసరావు, వెనిగండ్ల కోటయ్య, పసుపులేటి పాపిరెడ్డి, గంధం కోటేశ్వరరావు, కోటా చంటి పాల్గొన్నారు.

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ పిడుగురాళ్ల కూటమి నేతలు సోమవారం పట్టణంలోని పలువురు వైద్యులను కలిసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, పిల్లి చెన్నారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు పట్ట భద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును గెలిపించాలని కోరుతూ కూటమి నేతలు నెల్లూరి రామ కోటయ్య, కోటశాయన్నలు మండలంలోని కేసానుపల్లిలో ప్రచారం నిర్వహించారు. భట్రుపాలెంలో టీడీపీ గిరిజనవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీనాయక్ పట్టభద్రులను కలిసి ఆలపాటికి ఓటు వేయాలని కోరారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేరీ సుజన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మార్చి 31లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. వివరాలకు క్రోసూరు మోడల్ స్కూల్లో సంప్రదించాలన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

- పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, అన్ని విధాలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం సోమవారం మొదటి సారిగా ఆయన క్రోసూరులోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయానికివచ్చి కార్యకర్తలతో మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో తనకు అన్నివిధాలా సానుకూల వాతావరణం కన్పించిందని, గెలుపొందే అవకాశాలు ఉన్నాయని భావించానని, సూపర్ - 6 పథకాల వల్ల ప్రజలు మోసపోయి కూటమికి ఓటు వేశారన్నారు. ఎనిమిది నెలలుగా నియోజక వర్గానికి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనుంచి ప్రజలకు అన్నివిధాలా అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో ఈదా సాంబిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బెల్లంకొండ మీరయ్య, ఎంపీపీ కోటయ్య, గఫూర్, అప్పారావు పాల్గొన్నారు.



రేపల్లె: టెన్నిస్‌క్లబ్ రోడ్డులో డ్రైనేజీలో తాగునీటి పైపులు





గుంటూరు : పాల ఆస్పత్రి, బొంగరాలబీడులో మురుగు కాలువలో నుంచి వెళుతున్న మంచినీటి పైపులు



గుంటూరు : చౌత్రా, కన్నావారి తోటలో మురుగు కాలువలో నుంచి వెళుతున్న మంచినీటి పైపులు

గులియన్ గుబులు

- కలుషిత నీరు, ఆహారంతోనే జీబీఎస్ వ్యాప్తి
- పట్టణాల్లో ప్రమాద ఘంటికలు
- పట్టించుకోకుంటే పరిస్థితి విషమం

గులియన్ గుబులు ప్రజలను వెంటాడుతోంది.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా గులియన్ బారె సిండ్రోమ్ గురించే. బాధితుల రక్తం, మూత్రం, లాలాజలం పరీక్షించిన వైద్య నిపుణులు కలుషిత ఆహారం, నీరు, పారిశుధ్య లోపమే ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఇప్పటికే గుంటూరు జీజీహెచ్‌లో 13 మంది ఈ వ్యాధితో చేరగా, ఇద్దరు మరణించగా, ఆరుగురు చికిత్స పొంది డిశ్చార్జ్ అవ్వగా, మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగేనీరు, బయట తినే ఆహార పదార్థాల విషయంలో శుభ్రత పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆహార తనిఖీలపై దృష్టి సారించడం లేదు. మున్సిపాలిటీల్లో కూడా చాలా చోట్ల తాగునీటి పైపులైన్లు మురుగు కాలువ ల్లోనే ఉన్నాయి. గతంలో కూడా గుంటూరులో కలుషిత నీటి సరఫరా కారణంగా చాలా మంది డయేరియాతో మృతి చెందిన విషయం విధితమే. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు దాదాపు శూన్యం అని చెప్పవచ్చు. ప్రస్తుతం 'గులియన్' నేపథ్యంలోనైనా అధికారులు స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి



రేపల్లె: రైల్వేస్టేషన్ పక్కరోడ్డులో మురుగు కాల్వలో నానుతున్న తాగునీటి పైపులు



బాపట్ల : మూడోవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో డ్రైనేజీలో గుండా తాగునీటి ట్యాప్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన పైపు



పొన్నూరు : మురుగు కాలువలో ఉన్న పాత పొన్నూరుకు వెళ్లే ప్రధాన వాటర్ పైప్‌లైన్



పొన్నూరు : మురుగు కాలువలో నుంచి వెళ్తున్న శ్రీనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన పైప్‌లైన్



సీఎం చొరవ.. మిర్చి ధరల్లో కదలిక

- క్వింటాల్‌కు రూ. 1000కి పైగా పెరిగిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరలు క్రమేపి పెరుగుతున్నాయి. గత వారం క్వింటాల్‌కు రూ. వెయ్యి వరకు పెరిగిన వివిధ రకాల మిరపకాయల రేట్లు, మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిర్చి రైతులు, వ్యాపారులు, ఉన్నత స్థాయి అధికారులతో మిర్చి ధరల పెంపుపై నిర్వహించిన సమీక్ష దృష్ట్యా ఈ సోమవారం నుంచి మరో రూ. వెయ్యి వరకు ధరలు పెరిగాయి. మిర్చికి కేంద్రం కనీస మద్దతు ధర రూ. 11,781గా నిర్ణయించింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ ద్వారా కేంద్రం 2.58 లక్షల మెట్రిక్‌టన్నుల మిర్చి సేకరణకు అవకాశం కల్పించింది. తాము కొనుగోలు చేయకపోతే ప్రభుత్వం మిర్చిని సేకరించనుండటంతో వ్యాపారస్థులు కొనుగోళ్లకు ఉపక్రమించారు. దీంతో పోటీ పెరిగి ధర పెరగడం ప్రారంభమయ్యింది. సీఎం సమీక్ష సమావేశం అనంతరం మిర్చి ధరల్లో పెరుగుదల కనిపించడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది.

గుంటూరు మిర్చియార్డులో ప్రధానంగా 334, నంబరు. 5, 273, 341, 4884, సూపర్ 10, తేజ, షార్క్-1, బ్యాడిగి 355, సింజెంటా బ్యాడిగి 5531, ఎన్ 250 బుల్లెట్, దేవనూరు డీలక్స్ ఆర్మూరు వెరైటీల మిర్చి విక్రయాలు జరుగుతుంటాయి.

పది రోజుల క్రితం వరకు కూడా మిర్చి క్వింటాల్ ధర రూ. 11 వేల నుంచి రూ. 12 వేల మధ్యనే కొనసాగింది. సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం సోమవారం 341 వెరైటీకి రూ. 14,500 గరిష్ఠ ధర లభించింది. తేజకు రూ. 14,200 పెట్టి ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. 334ని రూ. 13500, నంబరు. 5ని రూ. 13,200, 272ని రూ. 13 వేలు, 4884ని రూ. 13500, షార్క్-1ని రూ. 12,500, బ్యాడిగి 355ని రూ. 13500, సింజెంటా బ్యాడిగి 5531ని రూ. 12 వేలు, ఎన్ 250 బుల్లెట్‌ని రూ. 13 వేలు, దేవనూరు డీలక్స్‌ని రూ. 13500, ఆర్మూరు వెరైటీని రూ. 11500 పెట్టి రైతుల వద్ద ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం మిర్చి దిగుబడి కూడా తక్కువగా ఉండడంతో ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి.



నిఘా నీడలో.. ఇంటర్ పరీక్షలు

(1వ పేజీ తరువాయి)

పత్రాల బండిల్స్ ప్యాక్ చేసేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్ఐఓ వివరించారు. ఈనెల 24న ప్రశ్నాపత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రా లకు(పోలీసు స్టేషన్స్) అత్యంత భద్రత నడుమ పంపిణీ చేశారు. పరీక్షల పర్యవే క్షణ కోసం 83 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభు త్వం నియమించినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్ వెల్లడించారు.

విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్కరణలు

ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారి హాజరుతో పనిలేకుండా ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాదు విద్యార్థుల సౌలభ్యం కోసం హాల్ టిక్కెట్లు వాట్సప్‌వెబ్(95523 00009) నుంచి డౌన్‌లోడు చేసుకుని ప్రిన్సిపల్ సంతకంతో పనిలేకుండా నేరుగా పరీక్షకు హాజరు అయ్యేలా ఏర్పాట్లు చేశా రు. పరీక్షలపై సందేహా లు, ఫిర్యాదుల చేసేందుకు ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేకసెల్ (0863-2228528) ఏర్పాటు చేశారు. ఇలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు నడుమ ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు ప్రణాళికలు ఇంటర్ బోర్డు అధికారులు సిద్ధం చేశారు.

- పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు : 81
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు : 34,273
- ద్వితీయ సంవత్సరం విద్యార్థులు : 34,973
- సీఎస్,డీవోలు : 166
- సిట్టింగ్,ఫ్లయింగ్ స్క్వాడ్స్ : 8
- స్టోరేజ్ కేంద్రాలు :16
- సీసీ కెమెరాలు: దాదాపు 400 పైగా



స్టోరేజ్ కేంద్రం వద్ద భద్రత

కోటప్పకొండలో... భక్తుల సందడి

- ప్రారంభమైన తిరునాళ్ల ఉత్సవాలు
- త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు
- కొండకు తరలి వచ్చిన ప్రభలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 24 : కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, విశేష ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. అధికారులు శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకుంది. అధిక సంఖ్యలో భక్తులు అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. చిట్టి పొట్టి ప్రభలు కొండ దిగువున కొలువు దీరాయి. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం, వివిధ సేవా సంస్థల ఆధ్వర్యం లో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో కొండ దిగువున భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుం టున్నారు. దీనివలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ సారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తులకు అనుమతి లేదని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రకటించారు. ఘాట్ రోడ్డులో నడకకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతిం చమని చెప్పారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం



అభిషేక మండపంలో శ్రీ త్రికోటేశ్వర స్వామికి అభిషేకం



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న కాపూరి ప్రభ

ప్రభల కోసం 8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హైటెన్షన్ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆ శాఖ ఈఈ రాంబొట్లు తెలిపారు. తిరునాళ్ల రోజున బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు గురువారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. భారీ విద్యుత్ ప్రభల నిర్వాహకులు ఆయా సమయాల్లో ప్రభలను తరలించాలని సూచించారు.



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలు ఇలా..

కోటప్పకొండ తిరునాళ్లలో యాత్రికుల సౌకర్యార్థం పోలీసులు అమలు చేస్తున్న ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు.

- నరసరావుపేట వైపు నుండి కోటప్పకొండకు వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో.. వీఐపీలు ముందుగా అనుమతి పొందిన వాహనాలలో ఉప్పలపాడు, పెట్లూరివారి పాలెం గ్రామం ఘాట్ రోడ్డు పక్కన కేటాయించిన వీఐపీ పార్కింగ్ ప్రదేశమునకు చేరుకుని, క్రమ పద్ధతిలో వాహనాలను పార్కింగ్ చేసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులలో వీఐపీలు కొండపైకి చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక వైపు ఏర్పాటు చేయబడిన మట్టి రోడ్డు నుంచి కొండకావూరు, పమిడిమర్రు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జేఎన్‌టీయూ కాలేజీ మీదుగా నరసరావుపేట, వినుకొండ హైవే పైకి చేరుకొని తిరిగి వెళ్ళవలసి ఉంటుంది.
- నరసరావుపేట నుండి కోటప్పకొండకు వచ్చే ప్రభలు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి యల్లమంద, గురువాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 4 గంటలకు ప్రభల నిధి వద్దకు చేరుకోవాలి. ఆ తరువాత అనుమతించరు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చే భక్తులు మిన్నెకల్లు నుంచి లక్ష్మీపురం వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకొని పెట్లూరి వారి పాలెం మీదుగా ఘాట్ రోడ్డు పక్కన గల జనరల్ పార్కింగ్ కు వెళ్లవలెను. మిన్నేకల్లు నుండి కోటప్పకొండ వైపు వాహనాలు అనుమతించరు.
- సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చే ప్రభలు మిన్నెకల్లు తంగేడు మల్లి, గురిజేపల్లి, యూటీ గ్రామాల మీదుగా ప్రభల నిధికి చేరుకోవాలి. మిన్నెకల్లు నుండి కోటప్పకొండ వైపు ట్రాఫిక్ అనుమతించరు.
- చిలకలూరిపేట నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ సెంటర్ నుంచి క్వారీ (క్రషర్) మార్గం గుండా వచ్చి వీఐపీ పార్కింగ్ నందు వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్ ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు చేరి చిలకలూరిపేట వెళ్ళాలి.
- చిలకలూరిపేట నుండి వెళ్ళు ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి నిధి దారి గుండా ప్రభల స్టాండు కు చేరాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్ నుంచి కట్టుబడివారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్ కు చేరాలి.
- ఏఎం రెడ్డి కాలేజీ ఎదురుగా గల పోలీసు చెక్‌పోస్టు నుంచి కోటప్పకొండ వైపు వాహనాలకు అనుమతి లేదు.
- యలమంద, గురువాయపాలెం వైపు నుంచి వచ్చే భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్ ను చేరి, యాదవ సత్రంనకు వెనుక గల పార్కింగ్ ప్రదేశం నందు వాహనాలను పార్కు చేసుకోవాలి.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి నరసరావుపేటకి వెళ్ళు వాహనాలు, చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్ లో మాత్రమే వెళ్లి ఏఎం కాలేజి వద్ద నరసరావుపేట బైపాస్ కు వెళ్లవలను. గురవాయపాలెం, యల్లమంద మీదుగా నరసరావుపేట వైపుకు వెళ్ళుటకు ఎటువంటి వాహనములు అనుమతించరు.
- శ్రీ త్రికోటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులు మీకు అందుబాటులో ఉన్న పార్కింగ్ ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ మీ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రభలకు ఆటంకం లేకుండా విద్యుత్ తీగల తొలగింపు: డీఈఈ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వెళ్ళే ప్రభలకు ఆటంకం లేకుండా ఉండేందుకు కొన్నిచోట్ల విద్యుత్ తీగలు తొలగిస్తున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ కారణంగా చిలకలూరిపేట రూరల్ మండలంలోని బొప్పూడి, పోతవరం, మద్దిరాల, యడవల్లి, కట్టుబడివారిపాలెం, కావూరు, లింగంగుంట్ల, కోమిటినేనివారిపాలెం, గంగన్నపాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాలకు మంగళవారం మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

పోలీసుల సూచనలు పాటించాలి: డీఎస్పీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ వద్ద దారిలో పోలీసులు సూచించిన నిబంధనలను పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవడానికి సహకరించాలని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు సోమవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభలతో కోటప్పకొండకు వచ్చేవారు మధ్యాహ్నం 12:00కల్లా ప్రారంభం కావాలని ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రం ఆరు గంటలకల్లా ప్రభలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి ఎట్టి పరిస్థితిలోనూ ప్రభలను కొండకు అనుమతించమన్నారు. తిరుగు ప్రయాణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉదయం ఐదు గంటలకల్లా ప్రభలు వారి గమ్యస్థానాలకు చేరేలా ప్రభ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి మైకులు డీజేలు అనుమతించమన్నారు. ఆయన వెంట సబ్ డివిజన్లోని సీఐలు బి.ప్రభాకర్ రావు, పి.రమేష్, ఎంవీ చరణ్, లోకనాథం తదితరులు ఉన్నారు.



గోల్డ్ మెడల్ అందుకుంటున్న మూలే అనిల్‌రెడ్డి

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రామిరెడ్డిపాలెం వాసికి గోల్డ్ మెడల్

రొంపిచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మూలే అనీల్‌రెడ్డి ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నెల 21వ తేదీ నుంచి గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన ఓపెన్ ఏషియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ క్లాసిక్ విభాగంలో జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో పాల్గొన్నారు. 60కేజీల విభాగంలో 405కిలోల బరువును ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. సోమవారం సూరత్‌లో గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు. అనీల్‌రెడ్డి, పిడుగురాళ్ళ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. తల్లి దండ్రులు వ్యవసాయం చేస్తుంటారు.



భాగ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ హ్యాండ్‌బాల్ జట్టుకు 'కృష్ణవేణి' విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ మహిళా హ్యాండ్ బాల్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి కే.భాగ్యశ్రీ ఎంపికైందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ నెల 21, 22 తేదీలలో తెనాలి జేఎంజే కాలేజీలో జరిగిన ఏఎన్‌యూ అంతర్ కళాశాల పోటీలలో ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించిందన్నారు. ఎంపికైన భాగ్యశ్రీని పీడీ ఈదర ఆదినారాయణ, అధ్యాపకులు అభినందించారు. మార్చి 2న చెన్నై పెరియార్ యూనివర్శిటీలో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలలో కే భాగ్యశ్రీ ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

పోలవరం డ్యామ్‌ను సందర్శించిన ఈశ్వర్ ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పోలవరం డ్యామ్‌ను సందర్శించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. పోలవరం డ్యామ్ ఏ ఏఈ ఎస్.రవికుమార్ పోలవరం డ్యామ్ పనిచేసే విధానంపై తెలియజేశారు. అనంతరం పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సందర్శించారు.

ఘనంగా వికాస్ స్కూల్ వార్షికోత్సవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న వికాస్ స్కూల్‌లో సోమవారం 17వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చార్టెడ్ అకౌంటెంట్లు చంద్రశేఖర్, హారిక, సింగు కోటేశ్వరరావు పాల్గొన్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అకడమిక్ ఎక్సలెన్సీ అవార్డులు, నూరుశాతం హాజరు అవార్డులు అతిథులు అందచేశారు. హ్యాండ్ రైటింగ్‌లో రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన 12మంది విద్యార్థులకు, ఐఐటీ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి స్కూల్ డైరెక్టర్లు పవన్‌కుమార్, రోజాశ్రీ, ప్రిన్సిపాల్ శ్యామ్ బాబు సర్టిఫికెట్లు అందచేశారు.

వేల్పూరు రెవెన్యూలో డిజిటల్ అక్రమాలు

- రీ సర్వేలో నమోదైన తప్పుల సవరణకు నగదు వసూళ్లు
- చక్రం తిప్పుతున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్
- నగదు ఇవ్వకపోతే దరఖాస్తుల తిరస్కరణ
- లోగుట్టుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు
- రెవెన్యూ గ్రామసభలు నిష్ఫలమేనా..?



రెవెన్యూ గ్రామసభల్లో అర్జీలు అందజేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతుల మధ్య భూ వివాదాలను పరిష్కరించి వారికి శాశ్వత భూ హక్కు కల్పిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే రైతులపాలిట శాపంగా మారగా, రెవెన్యూ అధికారులకు మాత్రం కాసుల వర్షం కురుపిస్తోంది. మండలంలోని వేల్పూరు రెవెన్యూ పరిధిలో జరిగిన రీ సర్వే పనులలో అనేక అక్రమాలు జరిగినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలలో అనేక తప్పులు నమోదయ్యాయి. రైతులు తప్పులు సవరణ చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించగా 60మందికి పైగా రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ రెవెన్యూ అధికారులు గ్రామసభలో 15 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు ప్రకటించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే తప్పులను వెంటనే సవరణ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పడంతో కొంతమంది రైతులు సచివాలయంలో దరకాస్తు చేసుకొన్నారు. దీన్ని అదునుగా భావించిన వేల్పూరు సచివాలయం-1 డిజిటల్ అసిస్టెంట్ సవరణలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన రైతులతో బేరసారాలు నడిపి సవరణ చేయాల్సిన పొలాన్ని బట్టి తనకు నగదును ఇస్తే రెవెన్యూ అధికారులకు తలాకొంత ఇచ్చి వెంటనే సవరణ చేయిస్తానని చెప్పి రైతుల వద్ద డబ్బులు వసూలు చేసినట్లుగా రైతులు వాపోతున్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని అడిగిన వారికి సర్వర్ రావడం లేదని, తహసీల్దార్ వద్ద దరఖాస్తుపై సంతకం పెట్టించుకుని వస్తేనే దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తానని షరతులు పెట్టినట్లు బాధితులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన ముంద్రు వంశీకృష్ణ, పూరేటి వీరనారాయణమ్మ, బంధంనేని శ్రీదేవి, రావి పెదబ్రహ్మయ్య, గోపు వెంకటనరేష్, మాలంపాటి హైమావతి, సూరాబత్తుని మల్లేశ్వరరావు, దావులూరి పద్మావతి మరికొందరి వద్ద సవరణలకు నగదు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. జనన ధ్రువీకరణ పత్రాలకు సుమారు 32మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో వేల్పుల ప్రశాంతి, పులుకూరి దేవ రమ్య, మరో 8మంది వద్ద రెవెన్యూ అధికారులు రూ.4500 చొప్పున నగదు తీసుకొని సర్టిఫికెట్‌లు ఇచ్చారని బాధితులు గోడు వెల్లబోసుకున్నారు. గంటవారిపాలెం గ్రామానికి చెందిన పుట్టా రామకోటేశ్వరరావు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు దరకాస్తు చేసుకోగా డబ్బులివ్వలేదని ఆయన దరకాస్తును తిరస్కరించారు. తరువాత రూ.3వేలు డబ్బులిచ్చాక తిరస్కరించిన దరకాస్తునే ఆమోదించినట్లు బాధితుడు వాపోయాడు. సచివాలయంలో 1బీ, అడంగల్ తీసుకొనేందుకు వెళ్ళిన రైతుల వద్ద డిజిటల్ అసిస్టెంట్ ఎక్కువ రుసుమును వసూలు చేస్తున్నాడని, అదేమని అడిగితే దానిరేట్లు అలానే ఉంటాయని, ఈసారి వచ్చినపుడు ఇస్తానులే అని చెబుతున్నాడని స్థానికులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌ను వివరణ కోరగా తహసీల్దార్ సెలవు పెట్టగా ఇటీవలనే ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించానని, రీ సర్వేలో తప్పులను సవరణ చేసేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, పక్కా ఆధారాలుంటే వెంటనే సవరణ చేస్తామన్నారు. రైతులెవ్వరూ మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, నేరుగా తహసీల్దార్‌ను సంప్రదించాలని తెలిపారు.

తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభలు సిద్ధం

- నేడు గ్రామాల నుంచి కోటప్పకొండకు తరలింపు



సిద్ధమైన కావూరు, కోమటినేనివారిపాలెం, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం విద్యుత్ ప్రభలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండ తిరునాళ్ల కోసం చిలకలూరిపేట నియోజకవర్గంలోని గ్రామాలలో 15భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. ఒక్కొక్క ప్రభకు రూ.35లక్షల నుంచి రూ.40లక్షల వ్యయం అవుతుందని అంచనా. ప్రధానంగా లైటింగ్ ఏర్పాటు, మందిర నిర్మాణం, అన్నదానానికి ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఆయా గ్రామాల నుంచి ప్రభను తరలించిన రోజు నుంచి తిరిగి గ్రామానికి వచ్చేవరకు భోజనాల కోసం ప్రత్యేక ఏర్పాటు చేసుకుంటారు. ఒక్కొక్క ప్రభ ఎత్తు సుమారు 90 అడుగుల వరకు ఉండేలా నిర్మించారు. ఆది, సోమవారాలలో ప్రభలను పైకి లేపి విద్యుత్ దీపాలు, డెకరేషన్ సామాగ్రితో అందంగా అలంకరించారు. బంధుమిత్రులతో గ్రామాలలో ప్రభ పండుగను జరుపుకున్నారు. చిలకలూరిపేట మండలంలో కావూరు, కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, కోమటినేనివారి పాలెం, గోవిందపురం, బొప్పూడి గ్రామాలలో, నాదెండ్ల మండలంలో అప్పాపురం, అమీన్ సాహెబ్‌పాలెం గ్రామాలలో భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. పట్టణ పరిధిలో ఉన్న పురుషోత్తమపట్నంలో బైరా, విడదల, తోట పుల్లప్ప తాత, గ్రామ, మండలనేని, చిన్నతోట వారి ప్రభలను సర్వాంగ సుందరంగా నిర్మించారు. బొప్పూడిలో గ్రామ ప్రభతో పాటు టీడీపీ ప్రభను నిర్మించారు. ప్రభలను ప్రభ బండిపై నిలబెట్టి ట్రాక్టర్‌తో కొండకు తరలిస్తారు. వందల మంది పగ్గాలను పట్టుకుని ప్రభను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అతి జాగ్రత్తగా ముందుకు సాగుతారు. కాగా చిలకలూరిపేట కోటప్పకొండ మధ్య దక్షిణ రాష్ట్రాల విద్యుత్ గ్రిడ్డును అనుసంధానం చేసే విద్యుత్ లైన్లను దాటి ప్రభలు ముందుకు వెళ్ళవలసి ఉంటుంది. ప్రభలు ఈ లైన్లను దాటి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు విద్యుత్ శాఖ అధికారులు అక్కడ మకాం చేసి సుమారు గంటకు పైగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రభలు సజావుగా వెళ్ళేందుకు వీలు కల్పిస్తారు. అయితే ఈ ఏడాది బొప్పూడి గ్రామ ప్రభతో పాటు మరికొన్ని ప్రభలకు 60 అడుగుల ఎత్తుపైన స్ప్రింగ్ బిగించారు. విద్యుత్తు లైన్లను దాటే క్రమంలో ప్రభ పైభాగం ముందుకు వంగేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

కావూరు గ్రామ ప్రభ ప్రత్యేకత

చిలకలూరిపేట మండలంలోని కావూరు గ్రామ ప్రభకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రభల నిర్మాణం కోసం గ్రామస్థులు గ్రామాన్ని ఆరు భాగాలుగా విభజించుకున్నారు. ఒక్కో ఏడాది ఆయా ఇంటి పేర్లు గల భాగం వారు ప్రభ నిర్మాణ బాధ్యతలు తీసుకుంటారు. ఈ ఏడాది కేతినేని, కోమటినేని, యర్రమాసు వారు, తదితరులు ప్రభను నిర్మించారు. ప్రభ పనులలో కులాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేస్తారు. సహపంక్తి భోజనాలు చేస్తారు. కావూరు ప్రభ ఈ ఏడాది 79వ ప్రభ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. తిరునాళ్ల ముందు రోజు ఉదయం కుంభం పోసుకుని ప్రభను గ్రామ వీధులలోగుండా తరలిస్తారు. ప్రతి ఇంటి వద్ద ప్రభను ఆపి కొబ్బరి కాయలు కొట్టిన అనంతరం కొండకు తీసుకువెళ్తారు.

● నాదెండ్ల: కోటప్పకొండ తిరునాళ్ళల్లో సందర్శించేందుకు రెండు భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. సుమారు 90 అడుగుల ఎత్తులో నిర్మించిన ఒక్కొక్క విద్యుత్ ప్రభ నిర్మాణానికి సుమారు రూ.30లక్షల నుంచి రూ.35లక్షల వరకు గ్రామస్థులు వ్యయం చేశారు. మంగళవారం ఉదయం ఈ రెండు ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయలుదేరి కోటప్పకొండకు వెళ్ళనున్నాయి.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



కరపత్రాలను ప్రదర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి లక్ష్మణరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో లీగల్ సెల్ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో యువత, ఉపాధ్యాయుల్ని మోసంచేసిన వాళ్ళను, వారికి అన్యాయం జరుగుతుంటే గొంతెత్తి మాట్లాడని వారిని ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓడించి తీరాలని కోరారు. న్యాయవాదులు ఆ విషయంలో ముందుండాలని, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. పీడీఎఫ్ తరఫున పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావు, ఉద్యోగాల భర్తీలో వైసీపీని ప్రశ్నించలేదన్నారు. పూర్తిగా వైసీపీకి తొత్తుగా వ్యవహరించి, తప్పుడు కేసులు పెడితే మాట్లాడని కేఎస్ లక్ష్మణరావు ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ మద్దతుతో పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావు ఓడించాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు లీగల్ సెల్ అధ్యక్షుడు చంద్రా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి షేక్ ఆలీబాషా, రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు వంగలూరు ఆంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి పూజల కోటయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ. జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు కోసూరి రాధిక, ఏడు నియోజకవర్గాల లీగల్‌సెల్ అధ్యక్షుడు, వివిధ హోదాలలో ఉన్న న్యాయవాదులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి తరఫున అభ్యర్థిగా ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య ఓటువేసి ఎన్నికలలో గెలిపించాలని మునిసిపల్ చైర్మన్ సోమవారం గ్రాడ్యుయేట్లకు విజ్ఞప్తి చేశారు.

● వినుకొండ టౌన్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్‌డీఏ బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని 15వార్డు, ఎన్ఎస్‌పీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ గంగినేని రాఘవ గురుకుల పాఠశాల, ఉర్దూ, ప్రాథమిక పాఠశాలలు, బాయ్స్, బాలికల హైస్కూల్స్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును రాజేంద్రప్రసాద్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, ఎస్టీయూ నాయకులు కృష్ణదాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రుణాలను నూరు శాతం రికవరీ చేయాలి: ప్రాజెక్టు డైరెక్టర్ హీరాలాల్

రొంపిచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో డీఆర్‌డీఏ పరిధిలో తీసుకున్న లోన్‌లకు సంబంధించిన రుణాలను నూరుశాతం రికవరీ చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ హీరాలాల్ తెలిపారు. సోమవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎం సోమశేఖర్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు రూ.20లక్షల మేర స్త్రీ నిధి, మండల సమాఖ్య, బ్యాంక్ లింకేజీ రుణాలను గ్రూపులకు నోటీసులను ఇచ్చి రికవరీ చేయాలన్నారు.



రచయితను సత్కరిస్తున్న దేవాలయ కమిటీ

అయోధ్య రామునిపై ప్రత్యేక పాట

వినుకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రచయిత, కవి రమణారెడ్డి అయోధ్య రామునిపై రచించిన పాటను సోమవారం పట్టణంలోని పాత శివాలయం వద్ద ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో అందజేశారు. ప్రధాన అర్చకులైన నారాయణం రామ్మోహన్ ఆచార్యులకు ప్రత్యేక పూజలు చేసి ఈ పాటను అందించారు. ఈ సందర్భంగా రమణారెడ్డిని పలువురు సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులనే వాడాలి: ఎంపీడీవో

శావల్యాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించినపుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంపీడీవో సీతారామయ్య సోమవారం ప్రారంభించారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు

రొంపిచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాల్లో ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహాశివరాత్రి పర్వదినం ముందు వచ్చే ఏకాదశికి శివాలయాల్లో విశేష పూజలు జరుగుతాయి. రొంపిచర్లలోని శంకర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీల కంఠేశ్వర స్వామి, మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లోని రామలింగేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పార్వతిదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలను నిర్వహించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా సోమవారం విశేషపూజలు జరిగాయి. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్‌శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కామేశ్వరస్వామికి అభిషేకాలను నిర్వహించారు. భక్తులు వెంకటేశ్వర స్వామి, కామేశ్వర స్వాములను దర్శించుకున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావు పేట లీగల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లింగంగుంట్ల వద్ద ఉన్న ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సదరం సర్టిఫికెట్ల పరిశీలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకి ఎంతమందికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతున్నది సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో ముచ్చటించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై రంగారావు మాట్లాడుతూ జిల్లాలో ఐదు ప్రాంతాలలో నరసరావుపేట, చిలకలూరిపేట, గురజాల, వినుకొండ, సత్తెనపల్లిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. రోజుకి వందమంది విజువల్ సర్టిఫికెట్లు 70మంది అంగవైకల్యం కలిగిన వారిని ప్రతి కేంద్రంలో పరిశీలించడం జరుగుతుందన్నారు. పరిశీలించిన సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

సీఎం చొరవతో మిర్చి రైతులకు భారీ ఊరట: జీవీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి చొరవతో స్పందించి మార్కెట్ ఇటర్ వెన్షన్ పథకం కింద రైతులను ఆదుకోవాలన్న కేంద్ర నిర్ణయం లక్షలాది మంది రైతులకు మేలు చేయనుందని జీవీ తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సీఎం చంద్రబాబు నాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్వింటా మిర్చికి కనీస ధర రూ.11,781 ఇవ్వాలని కేంద్రం ఉత్తర్వులు రైతులకు కొండంత అండ కానున్నాయన్నారు. ఈ సీజన్ ప్రారంభం నుంచే వ్యాపారులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించిన అంశాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నేరుగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి, ప్రధాని దృష్టికి ఈ విషయాన్ని దృష్టికి తీసుకుపోవడంతో వేగవంతమైన పరిష్కారం లభించిందన్నారు. రాజకీయం కోసం దొంగ దీక్షలు చేసేవారికి ఇవి ఏవీ అర్థంకావంటూ చురకలు వేశారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ



అక్క, చెల్లెళ్లను అభినందిస్తున్న ఎండీ చంద్రశేఖర్

యడ్లపాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యడ్లపాడుకు చెందిన అక్కా చెల్లెళ్ళు జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తమ సత్తాను చాటారు. గ్రామంలోని ఎగువ ఎస్సీ కాలనీకి చెందిన కెప్టెన్ కోడిరెక్క ధనలక్ష్మి, కోడిరెక్క పాప మార్టూరు మండలం తిమిరిబండలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొన్నారు. దక్షిణ భారతదేశం నుంచి ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ నుంచి బాలికల విభాగంలో తెలంగాణపై 2-0 తేడాతో విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచారు. జట్టు విజయానికి ఈ అక్కాచెల్లెళ్లు కృషిచేశారు. ఈ సందర్భంగా బోయపాలెంలోని విశ్వతేజ నూలు మిల్లులో ఎండీ దాసరి చంద్రశేఖర్ బాలికలిద్దరిని సోమవారం అభినందించారు.

కెనాల్‌లో శివమాలధారి గల్లంతు

గంటవారిపాలెం (శావల్యాపురం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కెనాల్‌లో స్నానం చేసేందుకు దిగి శివమాలధారి గల్లంతైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని శావల్యాపురం మండలం గంటవారిపాలెంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, దాసరిపుట్టుక గ్రామానికి చెందిన దాసరి మోహన్‌రావు(45) మరో 11మంది శ్రీకాకుళం నుంచి శ్రీశైలానికి బయలుదేరారు. గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద స్నానం చేసేందుకు దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు వెతుకులాడినా ప్రయోజనం లేకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కెనాల్ వద్దకు చేరుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి కాలువలో గాలింపు చేపట్టారు.

మునిసిపల్ కార్మికుల నిరసన

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు మాట్లాడుతూ మునిసిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత అంశాలపై మునిసిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని, వాటిని ప్రైవేట్ కంపెనీలు, ఏజన్సీలకు అప్పచెప్పవద్దన్నారు. అనంతరం మునిసిపల్ డీఈఈ రహీంకు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావులకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.చెంచయ్య, అక్కులయ్య, అంజయ్య, జయరావు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం గేటు వద్ద మునిసిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా సీపీఐ అధ్యక్షుడు మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున, యూనియన్ నాయకులు పచ్చిగొర్ల యేసు, ఏసు పాదం, శ్రీను, సాయి బాబు, కంచర్ల కోటేశ్వరరావు, దేవమ్మ, కొండమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో 'జాగ్వర్' శాఖ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పెండ్యాల హరినాథ్‌బాబు తదితరులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ మెయిన్ రోడ్‌లో జాగ్వర్ బాత్ అండ్ లైటింగ్ షోరూమ్‌ను ప్రారంభించారు. సోమవారం జాగ్వర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్, సూర్య ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ పెండ్యాల హరినాథ్‌బాబు ఈ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ 60సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. ఆంధ్ర, తెలంగాణలోనే కాకుండా 60దేశాల్లో కూడా జాగ్వర్ కంపెనీ ఇన్‌పోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్‌లో ప్రసిద్ధిగాంచిందన్నారు. చిలకలూరిపేటలో పోలూరి బ్రహ్మం, సత్యనారాయణ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ శానిటరీ పైప్స్ స్టోర్స్‌ను జాగ్వర్ బ్రాంచ్‌ను నాలుగు అంతస్తుల్లో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ బ్రాంచ్ హెడ్ అభిజిత్ సింగ్ జాగ్వర్, లక్ష్మీనారాయణ పైప్స్ అండ్ సానిటరీ స్టోర్స్ యజమానులు పోలూరి బ్రహ్మం, సత్యనారాయణ, సాయికృష్ణ జాగ్వర్ ఏపీ రిటైల్ ప్రాజెక్ట్ హెడ్, వంశీకృష్ణ ఏపీ, తెలంగాణ, ఎస్కో సూరిబాబు, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, సూర్య ఇంటర్నేషనల్‌సేల్స్ ఆఫీసర్ గిరిశేఖర్ పాల్గొన్నారు.